క్లుప్తంగా

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ రమేశ్

లింగాపూర్: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ రమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని పిక్లాతండా గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సుమారు 4 లీటర్ల గుడుంబా, 30 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఇందులో లింగాపూర్, జైనూర్ ఎస్సైలు గంగన్న, రవికుమార్ పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదగాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నీట్‌లో అర్హత సాధించిన విద్యార్థిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని, మండలంలోని ఉల్లిపిట్ట గ్రామానికి చెందిన ముంజం ఆకాశ్ నీట్‌కు అర్హత సాధించడం సంతోషంగా ఉందన్నారు. నాయకులు జక్కయ్య, విశ్వనాథ్, ప్రణయ్, వినోద్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

సీఐగా సంతోష్‌కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న సంతోష్‌కుమార్

కౌటాల: కౌటాల సీఐగా సంతోష్‌కుమార్ మండల కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్‌లో విధులు నిర్వహించిన సంతోష్‌కుమార్ కౌటాల సీఐగా బదిలీపై వచ్చారు. సీఐ మాట్లాడుతూ కౌటాల సర్కిల్ పరిధిలోని సిర్పూర్(టి), చింతలమానెపల్లి, కౌటాల, బెజ్జూర్ మండలాల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరు సహకరించాలన్నారు. కౌటాల సీఐగా విధులు నిర్వహించిన రమేశ్ బదిలీపై ములుగు జిల్లాకు వెళ్లారు.

ఆర్‌ఎంపీల మండల కార్యవర్గం

కౌటాల: మండల కేంద్రంలోని ఆర్‌ఎంపీ, పీఎంపీ భవనంలో బుధవారం ఆర్‌ఎంపీ, పీఎంపీల మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఆదే నాందేవ్, ప్రధాన కార్యదర్శిగా టి. శంకర్, కోశాధికారిగా ఎస్. సుకృజి, ఉపాధ్యక్షులుగా ఎన్. బిక్షపతి, సహాయ కార్యదర్శిగా పూసాల సతీష్, సలహాదారులుగా జి గోపాల్, ఎన్. పాండరినాథ్, ప్రచార కార్యదర్శిగా ఎన్. కుమార్, గౌరవ అధ్యక్షులుగా రాజేశ్వర్, సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ తెలిపారు.

మహిళకు పరిహారం అందజేత



పరిహారం చెక్కు అందజేస్తున్న భానేష్

రెబ్బెన: రెబ్బెన రేంజ్ పరిధిలోని బోడపల్లి గ్రామానికి చెందిన ఎల్ముకే కమలపై అడవిపంది దాడిచేసి గాయపర్చగా అటవీశాఖ నుంచి మంజూరైన పరిహారం చెక్కును బుధవారం రెబ్బెన రేంజ్ కార్యాలయంలో రేంజ్ అధికారి భానేష్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ నెల క్రితం వ్యవసాయ క్షేత్రంలో పనులు చేసుకుంటున్న కమలపై అడవిపంది దాడి చేసి తీవ్రంగా గాయపర్చగా అటవీశాఖ బాధితురాలికి రూ.39,897 పరిహారం చెక్కు మంజూరు చేసిందన్నారు. ఎవరూ కూడ అడవి జంతువులకు హాని చేయొద్దని సూచించారు.

ప్రతిఒక్కరూ బీమా చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

కౌటాల: ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవాలని కౌటాల టీజీబీ బ్యాంక్ మేనేజర్ రమేశ్ అన్నారు. గురుడుపేట మహిళా సంఘం సభ్యురాళ్ల మృతి చెందడంతో బుధవారం మండల కేంద్రంలోని టీజీబీ బ్యాంకులో బాధితులకు బీమా చెక్కులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అందరు బ్యాంకు సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సీసీ రాజమణి, వీవోఏ కొండయ్య, తదితరులు ఉన్నారు.

ప్రకృతి ఒడిలో 'బుగ్గ' అందాలు



జలపాతం వద్ద పర్యాటకులు



రాళ్ల మధ్యలో నుంచి జాలువారుతున్న సెలయేరు



జలపాతం వద్ద సహజ కొలను

- పర్యాటకులను ఆకర్షిస్తున్న సర్కేపల్లి 'బుగ్గ' జలపాతం
- తరలివస్తున్న ప్రకృతి ప్రేమికులు
- సౌకర్యాలు కల్పిస్తే మరింత అభివృద్ధి

వాంకిడి: ప్రకృతి ఒడిలో సహజసిద్ధంగా వెలిసిన 'బుగ్గ' జలపాతం అందాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. వాంకిడి మండలం నుంచి సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉండే జలపాతం సహజ ప్రకృతి అందాలతో జనాలను ఆకట్టుకుంటోంది. సర్కేపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో భారీ వృక్షాలు, పెద్దపెద్ద రాళ్లు, పక్షుల కిలకిల రావాలతో నిండి సందర్శకులను ప్రకృతి అందాలు ఆకర్షిస్తున్నాయి. రాళ్ల మధ్యలో నుంచి జాలువారే జల సవ్వళ్లు, ఎత్తు ప్రాంతం నుంచి ఎగిసి పడే జల ధారలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వేసవి, చలి కాలాల్లోనూ కొంత వరకు నీటి ప్రవాహం ఉంటుండగా వర్షాకాలంలో నీటి ప్రవాహం పెరిగి మరింత ఆహ్లాద వాతావరణాన్ని సంతరించుకుంటుంది. జలపాతం వరకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోయినా ప్రకృతి ప్రియులు సుమారు రెండు కిలోమీటర్లు నడకన వెళ్లి బుగ్గ జలపాతాన్ని సందర్శిస్తున్నారు.

పెరిగిన పర్యాటకుల తాకిడి..

సర్కేపల్లి బుగ్గ జలపాతం కురుస్తున్న వర్షాలకు పరవళ్లు తొక్కుతుండటంతో పర్యాటకుల తాకిడి పెరిగింది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఒక కిలో మీటరు మేర బండ రాళ్ల మధ్యలో నుంచి, పైనుంచి నీటి ధారలు ఎగసిపడుతుంటాయి. దీనికితోడు ప్రకృతి పచ్చదనం ఎంతో ఆహ్లాదాన్ని పంచుతోంది. పైనుంచి పడే జలధారతో కింద ఏర్పడ్డ కొలను ఆకట్టుకుంటుంది.

ఎలా వెళ్లాలంటే..

బుగ్గ జలపాతం ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తుంది. ఇక్కడికి వెళ్లాలంటే వాంకిడి మండల కేంద్రం నుంచి సుమారు 12 కిలోమీటర్లు ప్రయాణించాలి. మండల కేంద్రం నుంచి 2.5 కిలో మీటర్లు ప్రయాణిస్తే ఖమాన గ్రామం వస్తుంది. అక్కడి నుంచి లక్ష్మీపూర్ గ్రామం మీదుగా మూడు ఆదివాసీ గ్రామాలు దాటి వెళ్తే సర్కేపల్లి గ్రామం వస్తుంది. అక్కడి నుంచి సుమారు 1.5 కిలో మీటర్లు పంట చేలల్లో నుంచి కాలినడకన అటవీ ప్రాంతంలోకి వెళ్లాలి. వాంకిడి నుంచి మారెపల్లి అనే గ్రామం వరకు సుమారు 9 కిలోమీటర్లు బీటీ రోడ్డు ఉంది. అక్కడి నుంచి 3 కిలో మీటర్లు అటవీ అనుమతులు లేక రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. బుగ్గ జలపాతానికి వర్షా కాలంలోనే పర్యాటకుల తాకిడి అధికంగా ఉండగా రోడ్డు లేని కారణంగా ప్రయాణం కొంత వరకు కష్ట తరమవుతుంది. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఏళ్ల కల నెరవేరిన వేళ



బెజ్జూర్‌లో కొత్త రేషన్‌కార్డు అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్సీ విఠల్

- మండలంలో 322 మందికి కొత్త రేషన్ కార్డులు
- 985 మంది పేర్లు నమోదు

బెజ్జూర్: దాదాపు 13 ఏళ్లుగా రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న వేలాది కుటుంబాల ఆశలు ఎట్టకేలకు నెరవేరాయి. పెళ్లయిన జంటలు, పిల్లలు జన్మించిన కుటుంబాలు పలు కారణాలతో రేషన్ కార్డులు అందకపోవడంతో ఎన్నో ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉంటున్నారు. గత ప్రభుత్వం హయాంలో వాగ్దానాలు చేసినప్పటికీ, వాటిని అమలు చేయడంలో విఫలమయ్యారు. ఒక్క కొత్త కార్డు కూడా మంజూరు చేయలేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం సమస్యను సీరియస్‌గా తీసుకొని రేషన్ కార్డుల మంజూరుకు చర్యలు ప్రారంభించింది.

322 మందికి కొత్తగా..

మండలంలో ఇప్పటివరకు 322 మందికి నూతన రేషన్ కార్డులు మంజూరయ్యాయి. కాగా 985 మంది లబ్ధిదారుల పేర్లు రేషన్ కార్డుల్లో నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. ఏళ్లుగా ఎదురుచూస్తున్న రేషన్ కార్డులు అందనుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

2011లో వివాహం..



2011 మే 5న మా వివాహం జరిగింది. ఇద్దరు కుమారులు సైతం ఉన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రేషన్ కార్డు లేదు. దీంతో నానా అవస్థలు పడ్డాను. ఈ ప్రభుత్వం రేషన్ కార్డు ఇవ్వడంతో ఏళ్ల నాటికల నెరవేరింది. – బక్కన్న, సిద్దాపూర్

ఇబ్బందులు పడ్డా..



గత 10 ఏళ్లుగా రేషన్ కార్డు లేక పలు ప్రభుత్వ పథకాలకు అనర్హుడిగా మిగిలిపోయాను. ప్రభుత్వం ఇ చ్చిన ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇల్లు, బ్యాంక్ రుణం కూడా మాఫీ కాలేదు. ప్రస్తుతం కొత్త రేషన్ కార్డు వచ్చింది.

– కొట్రంగి శంకర్, సిద్దాపూర్

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా సెక్యూరిటీ డీజీఎంగా విధులు నిర్వహించి బీపీఏ ఓసీపీ–2 ప్రాజెక్టు అధికారిగా బదిలీపై వెళ్తున్న ఉమాకాంత్‌ను బుధవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులు సన్మానించారు. బెల్లంపల్లి ఏరియా సెక్యూరిటీ అధికారిగా బదిలీపై వచ్చిన దాసరి శ్రీధర్‌తో పాటు బదిలీపై వెళ్తున్న అధికారిని ఏఐటీయూసీ నాయకులు శాలువాలతో సన్మానించారు. ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి మాట్లాడుతూ సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ విభాగం సేవలు కీలకమైనవన్నారు. కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, జీఎం కమిటీ సభ్యులు ఆనంద్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కిరణ్‌బాబు, రాజయ్య, రమేశ్, నాయకులు అంజయ్య, కోటి, బాబా, రమేశ్, జహంగీర్, శ్రీనివాస్, అశిష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డా.వరుణ్

దహెగాం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కేంద్ర బృందం సభ్యుడు, అసిస్టెంట్ డైరెక్టర్ డా.వరుణ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. లేబర్ రూం, వార్డులు, ఫార్మసీ, ల్యాబ్ తనిఖీ చేశారు. అస్పత్రిలోని మందులు పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోగులతో మాట్లాడి సేవలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యురాలు అశ్విని, సిబ్బంది ఉన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

వాంకిడి: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయం చేస్తూ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. క్రమం తప్పకుండా డ్రైడే నిర్వహించాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా ఓటర్ లిస్ట్ తయారు చేయాలని ఆదేశించారు. మండల పంచాయతీ అధికారి జావిద్, ఏపీవో శ్రావణ్ కుమార్, ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై కళాజాత

మండల కేంద్రంలో బుధవారం తెలంగా ణ సాంస్కృతిక సారథి బృందం ఆధ్వర్యంలో సీజ నల్ వ్యాధులపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం, దోమల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, మాదకద్రవ్యాల వాడకంతో కలిగే నష్టాలు వంటి అంశాలపై ఆటపాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు గొడిసెల బాపు, పవార్ మోహన్ నాయక్, మరప పురుషోత్తం, కోదాది సోమశేఖర్, గుండ శిరీష, బొమ్మగోని వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో కళాబృందం సదస్సు



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

కౌటాల: మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో కళాబృందం సభ్యులు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే పోలీసులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. సోషల్ మీడియా, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని, చదువుతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. విద్యార్థినులు హింసకు గురైతే షీటీంను సంప్రదించాలని సూచించారు. ఎస్సై విజయ్, ఎస్‌వో పవిత్ర, సంఘవి, రజిత, రాంచందర్, రోహిత్, చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: బీజేపీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం మండలంలోని బూర్గుడ గ్రామానికి చెందిన సుమారు 100 మంది వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న పనుల్లో అధికంగా కేంద్రం నిధులతోనే చేపడుతున్నట్లు పేర్కొన్నారు. స్థానికసంస్థల ఎన్నికల్లో మండలంలో అధిక సీట్లు బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. లక్ష్మీనారాయణ, రాజేశం, కోటేశ్వర్, అభయ్ ఆచార్య, శ్రీనివాస్, కృష్ణమూర్తి, మహేశ్, మల్లేష్, దీపక్‌రావ్, వెంకన్న, ప్రసాద్‌గౌడ్, సుగుణాకర్, ప్రహ్లాద్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం'

బెజ్జూర్: సీఎం సహాయ నిధి పథకం పేద ప్రజలకు వరమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. బెజ్జూర్ మండలంలోని కోర్తగూడ గ్రామానికి చెందిన కొరెత శ్రీశైలం కుటుంబ సభ్యులకు రూ.54వేల సీఎం సహాయనిధి చెక్కును బుధవారం మండల కేంద్రంలో అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి పథకం ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు.

టీఎన్‌జీవో ఆసిఫాబాద్ యూనిట్ కార్యవర్గం



నూతన కార్యవర్గం

ఆసిఫాబాద్: టీఎన్‌జీవో ఆసిఫాబాద్ యూనిట్ కార్యవర్గాన్ని బుధవారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణప్రసాద్, కోశాధికారిగా సాయి భార్గవ్, అసోసియేట్ అధ్యక్షుడిగా రహ్మత్ అలీ, మహిళా ఉపాధ్యక్షురాలిగా బి.శిల్ప, ఉపాధ్యక్షులుగా బి.రవీందర్, శివకుమార్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.విద్యశ్రీ, శ్రావణి, ప్రచార కార్యదర్శిగా నవితశ్రీ, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా రిజ్వాన్, స్పోర్ట్స్ సెక్రెటరీగా బి.శ్రీకాంత్, ఈసీ మెంబర్లుగా కె.దీపిక, ఎండీ సాదిక్ అలీని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా డిప్యూటీ స్టాటస్టికల్ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు వ్యవహరించారు.

విద్యుత్ శాఖలో సింగిల్‌విండో వ్యవస్థ

ఆసిఫాబాద్: హెచ్‌టీ సర్వీసుల మంజూరుకు విద్యుత్ శాఖలో సింగిల్ విండో వ్యవస్థ ఎంతో దోహదపడుతుందని ట్రాన్స్‌కో ఎస్ఈ రాథోడ్ శేషారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌టీ 11 కేవీ, 33 కేవీ, ఆపై ఓల్టేజీ సర్వీసుల మంజూరును మరింత సరళీకృతం చేయడానికి హెచ్‌టీ మానిటర్ సెల్‌ను సర్కిల్ ఆఫీస్, కార్పొరేట్ ఆఫీస్‌లో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 11 కేవీ వోల్టేజీ దరఖాస్తులను సర్కిల్ ఆఫీస్ ఏడీఈ కమర్షియల్ అధికారి పర్యవేక్షిస్తారని, అలాగే 33 కేవీ వోల్టేజీ, ఆపై వోల్టేజీ దరఖాస్తులను ఏడీఈ కమర్షియల్ అధికారి మానిటర్ చేస్తారన్నారు. వినియోగదారులు అవసరమైన పత్రాలతో హెచ్‌టీ దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

'వైద్యసిబ్బంది నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి'



మాట్లాడుతున్న నాయకులు

రెబ్బెన: మండలంలోని గొల్లగూడకు చెందిన మొగిళి శ్యాం అనే నాలుగేళ్ల బాలుడి మృతికి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్ అన్నారు. బుధవారం బాలుడి బంధువులను కలిసిన అనంతరం పీహెచ్‌సీ వద్ద విలేకర్లతో మాట్లాడారు. రెబ్బెన పీహెచ్‌సీలో రోగులకు సరైన వైద్యం అందడం లేదన్నారు. పాముకాటు వేయడంతో తల్లిదండ్రులు బాలుడిని పీహెచ్‌సీకి తీసుకువస్తే వైద్యం అందించలేదని, కనీసం అంబులెన్స్ కూడా అందుబాటులో లేకుండా పోయిందన్నారు. అర్ధరాత్రి బాలుడిని బైక్‌పై బెల్లంపల్లికి తరలించాల్సి వచ్చిందన్నారు. బాలుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కుందారపు బాలక్రిష్ణ, లక్ష్మీపూర్ మాజీ సర్పంచ్ శ్యాంరావు, నాయకులు శ్రీశైలం, సుభాష్, మల్లేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సకాలంలో యూరియా పంపిణీ చేయాలి

బెజ్జూర్: రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేయాలని బీఆర్‌ఎస్ నాయకుడు, సహకార సంఘం మాజీ చైర్మన్ అర్షద్ హుస్సేన్ అన్నారు. బుధవారం మండలంలోని పాపన్నపేట గ్రామాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సహకార సంఘం కార్యాలయం చుట్టూ యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. దళారులు యూరియాను అధిక ధరలకు బయట మార్కెట్‌లో అమ్ముతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు గ్రామాలకు వెళ్లి టోకెన్స్ రాసుకొని గ్రామాలకు వెళ్లి యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం

కెరమెరి: ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందామని రాజ్‌గోండ్ సేవా సమితి మండలాధ్యక్షుడు పెందోర్ మోతీరాం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతీ సంవత్సరం ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నప్పటికీ ఆదివాసీల చట్టాలు, హక్కులకు రక్షణ లేకుండాపోతుందన్నారు. దినోత్సవం పురస్కరించుకుని గురువారం నెహ్రూనగర్ ఆదివాసీభవన్‌లో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆత్రం బొజ్జిరావు, మడావి రఘునాథ్, కుద్మెత సోము, రాము తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తనిఖీ

సిర్పూర్(టి): మండలంలోని నవేగాం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంపీడీవో సత్యనారాయణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాభ్యాసం, విద్యాబోధన తీరును పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన వసతిని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యమైన భోజనం అందించాలని, వర్షాకాలంలో కలుషిత నీరు, కలుషిత ఆహారం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పెద్దవాగు సమీపాన గల శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు నగేశ్ స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతీ నెల చివరి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కమిటీ ప్రతినిధులు వేణుగోపాల్, వెంకట్‌గౌడ్, వినాయక్, మల్లేష్, సంతోష్, శ్యాం, సాయి, విశాల్, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రగతి సాధించాలి

కెరమెరి: విద్యార్థులు మరింత ప్రగతి సాధించాలని కెరమెరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో బోర్డుపై రాయించారు. పుస్తకం చదివించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అన్ని తరగతుల విద్యార్థులు తెలుగు, ఆంగ్లంలో పదాలు చదవడం, రాయడం రావాలని, చతుర్విధ ప్రక్రియలు చేయడం నేర్పాలని ఉపాధ్యాయులకు సూచించారు.

స్పాట్ అడ్మిషన్లు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల 31న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దరఖాస్తులు స్వీకరించి సాయంత్రం లోగా స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌజింగ్ పీడీ వేణుగోపాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సందీప్ నగర్‌లో బుధవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు రాపర్తి కార్తీక్, రామగిరి అశోక్, షాహిద్, అసద్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రవీందర్

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్ అన్నా రు. జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో బుధవారం జిల్లా కార్యవర్గ సమావే శం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సంఘటితంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, కోశాధికారి ఆనంద్, నాయకులు కృష్ణారావు, యశ్వంత్ రావు తదితరులు పాల్గొన్నారు.